క్లుప్తంగా

ఘనంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో కొలువు దీరిన వల్లీ, దేవసేన సమేత నాగేంద్రస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. స్వామి వారిని మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజలను వైభవంగా జరిపించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ లక్ష బిల్వార్చన పూజను కనుల పండువలా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. ఆలయం వద్ద గురువారం అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

అమరులకు కొవ్వొత్తులతో నివాళి

మామిడికుదురు: 2019 ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన అమర వీరులకు మామిడికుదురులో బుధవారం విద్యార్థులు నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి అమర వీరుల చిత్రాలు ప్రదర్శించి అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని డీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణలో సైనికులు భాగస్వాములు కావడం వల్లే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. వారి త్యాగాలు చిరస్మరణీయమని శ్లాఘించారు.

పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో



రామేశ్వరం పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో దొర

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర సఖినేటిపల్లి, రామేశ్వరం పీహెచ్‌సీలను బుధవారం సందర్శించారు. రామేశ్వరం పీహెచ్‌సీలో పై పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆయన సమీక్షించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులను వెంటనే పంపిణీ చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

ఇమామ్ హుస్సేన్ జయంతి సేవలు



రాజోలులో రోగులకు పండ్లు అందజేస్తున్న సూపరింటెండెంట్ సూర్యనారాయణ

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకుడు మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ జయంతి పురస్కరించుకుని బుధవారం నగరం, రాజోలు ప్రభుత్వాస్పత్రుల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరం గ్రామానికి చెందిన గురుహే మొహిబ్బానే జహెరా యువజన సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇమామ్ హుస్సేన్ సూచించిన ఉపదేశాల కరపత్రాలను పంచారు. కార్యక్రమాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.సూర్యనారాయణ, సంఘం సభ్యులు సయ్యద్ రూహి, అబ్బాస్ హుస్సేన్, జాఫర్ అబ్బాస్, అజీబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం



అంబాజీపేటలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: అనాథ వృద్ధులకు వస్త్రదానం చేయడం ఎంతో అభినందనీయమని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేటలో స్వామి వివేకానంద యోగా ఆశ్రమం ఆయుర్వేద ఫిజియోథెరపి హాస్పిటల్ యోగా గురువు యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని అంబాజీపేట, గంగలకుర్రు, పుల్లేటికుర్రు, కె.పెదపూడి తదితర గ్రామాల్లో సుమారు 150 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ పేదలకు సాయమందిస్తున్న శ్రీనివాస్ అభినందనీయుడన్నారు.

సిబ్బంది, కార్మికులకు దుస్తుల పంపిణీ

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయ ప్రాంగణంలో బుధవారం దేవస్థానంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు దాతలు సమకూర్చిన దుస్తులను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పంపిణీ చేశారు. దాతలు విష్ణుభట్ల సుందర్రావు, ముళ్లపూడి శ్రీమన్నారాయణ, అక్కపెద్ది ప్రకాష్, గోశాల సోమశేఖర్, తల్లావర్జుల వేణుగోపాల్, కోనేరు వెంకటరామరావులు కలిపి దుస్తులను సమకూర్చారు. దాతలను ఎమ్మెల్యే అభినందించారు. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, నాయకుడు తాడి సహదేవ్, స్థానికులు పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే..



మోరి శివాలయంలోని సరస్వతి ఆలయం వద్ద అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు



మామిడికుదురులో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

- సరస్వతీదేవికి పూజలు
- ఘనంగా అక్షరాభ్యాసాలు

సఖినేటిపల్లి: మోరి శివాలయం ప్రాంగణంలో కొలువైన సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పిల్లాపాపలతో కలసి తల్లిదండ్రులు పూజలు నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కొత్త పలకలను వారికి ఇచ్చి, అక్షరాలను దిద్దించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: వసంత పంచమి సందర్భంగా చదువుల తల్లి సరస్వతీదేవికి బుధవారం మామిడికుదురులో విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి నాడు సరస్వతీదేవి జన్మించిన రోజు కావడం విశేషం. సరస్వతీదేవికి పూజలు చేయడం వల్ల విద్యార్థులు చదువులో రాణిస్తారని, ఇదే రోజు పిల్లలకు అక్షరాభ్యాసం కూడా చేయిస్తారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వసంత పంచమి సందర్భంగా విద్యార్థినులు సరస్వతీదేవి వేషధారణలో అలరించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వసంత పంచమి వేడుకలు గంగలకుర్రు ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా జరిగాయి. వసంత వేడుకల్లో భాగంగా సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు విద్యార్థులు సరస్వతీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పలకలు పంపిణీ చేశారు.

శనైశ్చర క్షేత్రంలో..

కొత్తపేట: వసంత పంచమి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సామూహిక సరస్వతీదేవి పూజ, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసీ అండ్ ఈవో ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేదపండితులు పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలలతో సామూహిక పూజలు, పలువురు బాలలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మందపల్లి వీడీసీ కన్వీనర్ సాదు చెంచయ్య, వైస్ ప్రెసిడెంట్ గ్రంధి చంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు అడపా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల ఉదారత స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- లక్కవరంలో సచివాలయ భవనం ప్రారంభం



లక్కవరంలో సచివాలయంను ప్రారంభించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: దాతల ఉదారత స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. మండలంలోని లక్కవరంలో స్థలదాత ముదునూరి గుర్రాజు, వెంకట నరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఆయన తనయుడు ప్రసాదరాజు నూతనంగా నిర్మించిన లక్కవరం గ్రామ సచివాలయం-2 ను జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుతో కలసి బుధవారం ప్రారంభించారు. సభలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ సంకల్పానికి దాతలు తోడైతే చక్కని ఫలితాలు వస్తాయనడానికి ఇదో ఉదాహరణ అని అన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే అన్ని రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఎన్నికల సమయానికి పనులు పూర్తవుతాయన్నారు. అలాగే ప్యాచ్ వర్క్ నిమిత్తం రూ.4 కోట్లు కొత్తగా మంజూరయినట్లు ఎమ్మెల్యే అన్నారు. హామీలన్నీ అమలు చేసి ఎన్నికలకు వస్తున్న ఏకైక సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. ప్రతి గ్రామానికి ఈ ఐదేళ్లలో రూ.30 నుంచి 50 కోట్ల వరకూ లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, నాయకులు కేఎస్ఎన్ రాజు, మంగెన సింహాద్రి, సర్పంచ్ కోట పుష్పకుమారి, ఎంపీటీసీ మంగెన సూర్యకుమారి, మంగెన భూదేవి, సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



మోరిలో సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టాండన్‌రాజు

సఖినేటిపల్లి: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు బుధవారం మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య, రాజోలు పరిరక్షణ సమితి, మానవ హక్కుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. సంజీవయ్య చిత్రపటం వద్ద మహిమ సీపీసీ చైర్మన్ ఓగూరి టాండన్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా ఆయన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికారని టాండన్‌రాజు కొనియాడారు. చింతా శేషు, మేడిది ఏషయ్య, తోటె జాన్‌బాబు, ముత్యాల శ్రీనివాసరావు, పోతుల శేఖర్, నల్లి ప్రసాదరావు, గెడ్డం బాలరాజు, ఎం.సత్యనారాయణ, చింతా సత్య పాల్గొన్నారు.

పక్షవాతం రోగికి ఆర్థిక సాయం



బాధితురాలి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో రెండు నెలలుగా మంచానపడిన బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.10,500 నగదు సాయాన్ని అందినట్టు సంస్థ సభ్యులు బుధవారం తెలిపారు. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన తాడి సత్యవతి రెండు నెలలుగా పక్షవాతంతో మంచాన పడ్డారు. కొడుకు ఇటీవల చనిపోయాడు. కూతురుకి మతిస్థిమితం లేదు. భర్త వృద్ధాప్యంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. వీళ్లను పోషించేవారు ఎవరూ లేక వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు మహేంద్రవాడ వెళ్లి సత్యవతి కుటుంబ సభ్యులకు సాయాన్ని అందజేశారు. అలాగే 25 కేజీల బియ్యాన్ని కూడా అందించారు.

ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి



మంత్రి విశ్వరూప్, ఎండీ తిరుమలరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలోని నాలుగు డిపోల కార్మికులకు వైద్య సౌకర్యం అందించేందుకు అమలాపురంలో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుకు యునైటెడ్ వర్కర్స్ సంఘ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధవారం అమలాపురం నూతన బస్టాండ్ ప్రారంభోత్సవానికి వచ్చిన వీరిని సంఘ నేతలు జి.శ్రీనివాస్, కేఎస్‌పీ రావు, గణపతిరావు కలసి వినతిపత్రం సమర్పించారు. అమలాపురం డిపో నుంచి చెన్నై, బెంగళూరుకు డైరెక్ట్ బస్సులు ఏర్పాటు చేయాలని, అమలాపురం డిపోలో ఆర్టీసీ పెట్రోల్ బంకును ఏర్పాటు చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేయాలని విజ్ఞప్తి చేశారు.

గజమాల యాత్రకు మంత్రికి ఆహ్వానం



మంత్రి విశ్వరూప్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న సంఘ నాయకులు

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్రకు మంత్రి విశ్వరూప్‌ను అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు బుధవారం ఆహ్వానించారు. ఈ నెల 14వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు నుంచి యాత్ర ప్రారంభమవుతుందని ఆ వేడుకలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, గజమాల యాత్ర వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు, రాజోలు నియోజకవర్గ అగ్నికుల సంఘాల సమైఖ్య అధ్యక్షుడు ఇల్లింగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు విడుదల చేయాలి

కొత్తపేట: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు గత ఐదేళ్లుగా చెల్లించవలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ జేఏసీ కొత్తపేట తాలూకా నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ జేఏసీ దశలవారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో జీవీవీ సత్యనారాయణకు, తహసీల్దార్ ఎలీషాకు మెమోరాండం సమర్పించారు. తాలూకా జేఏసీ అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ రామారావు, తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు, యూటీఎఫ్, ఎస్టీయూ, పంచాయతీరాజ్ యూనియన్ నాయకులు టి.విజయకృష్ణ, ఎ.రామచంద్రప్రసాద్, కేపీసీహెచ్ సూర్యారావు, జి.రామ్‌కుమార్, కె.శామ్యూల్‌రాజు, ఎస్.రుద్రరాజు, ఎన్.అరుణసుందరి తదితరులు పాల్గొన్నారు.

'పీపుల్స్ సర్వీస్' సేవలు అభినందనీయం



దుప్పట్లు, చీరలు పంపిణీ చేసిన సత్యనారాయణ తదితరులు

ముమ్మిడివరం: పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఓఎస్‌జీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ చైర్మన్ కె.సత్యనారాయణ అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు ఎస్.స్టీఫెన్‌బాబు కుటుంబ ఆర్థిక సహకారంతో సమకూర్చిన దుప్పట్లు, చీరలు 150 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆయాలు, నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంస్థ గౌరవాధ్యక్షుడు టి.నాగరాజారావు అధ్యక్షత వహించారు. అ

మహా శివరాత్రి ఏర్పాట్లకు శ్రీకారం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ లక్ష్మీనారాయణ, పండితులు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12 వరకూ జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ ఆవరణలో ఉదయం 8.31 గంటలకు పందిరి రాట ముహూర్తానికి ఆలయ చైర్మన్ పెన్మత్స వాసు రాజు , ఆలయ పర్యవేక్షణాధికారి వీరభద్రరావు, ఆలయ పాలక మండలి సభ్యులు భూమిపూజ చేసి, పందిరి రాట నాటారు. ఆలయ అర్చకులు యనమండ్ర సవిత్ర తేజ, స్వస్తి వాచకులు నాగాభట్ల రవిప్రసాద్, వేద పండితులు గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి తదితర పండితులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ, తెప్పోత్సవం తదితర ఏర్పాట్లు చేయనున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని నిబంధనలు పాటిస్తూ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.గంగబాబు, వలవల రామకృష్ణ, దండు వీరభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



పులిదిండి వేణుగోపాలస్వామి ఆలయ పునః ప్రతిష్ఠలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని పులిదిండిలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సమేత మీసాల వేణుగోపాల స్వామి ఆలయ శిఖర, విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాలు బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం 10.58 గంటలకు విగ్రహ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను అర్చకుడు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పాల్గొని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచశయ్యోద్ధారణ, త్రిషవణస్నానం, రత్నన్యాసం, యంత్ర విగ్రహప్రతిష్ఠ, పూర్ణాహుతి, జీవకళావాహన, గోదర్శనం, శాంతి కల్యాణం ఆశీర్వచన, దీక్షా విసర్జన, పండిత సత్కారం, తీర్థప్రసాద వితరణ తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు, దాతల నుంచి రూ.25 లక్షలు సమకూరిందన్నారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన దాతలను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధిలో దాతల పాత్ర కీలకమని శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలం కావడంతో నూతన ఆలయాన్ని పునఃనిర్మించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నూతన ఆలయం కారణంగా గ్రామం సుభిక్షంగా అన్నారు.

తరాల క్రితం నిర్మించిన ఆలయాలు ఆనాటి ప్రజల దాతల ముందుచూపునకు నిదర్శనమన్నారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు ఆలయ నిర్మాణానికి చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే



అంతర్వేది దేవస్థానంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి పార్టీ జెండాలను చేతబట్టిన కార్యకర్తలు, నాయకులతో కలిసి ముహూర్త సమయానికి ఆయన ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రాంగణంలో ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేశారు. ఇంటింటా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మేలు చూసి ఓటు వేయాలని ప్రచారంలో ఆయన కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పెదపాటి నాగలక్ష్మి, సర్పంచ్ కొండా జాన్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు కొల్లాబత్తుల చిట్టిబాబు, దొమ్మేటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి తేనెతో అభిషేకం



పెదపట్నంలంకలో షిర్డీ సాయిబాబా వార్షికోత్సవ పూజలో పాల్గొన్న మహిళలు

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలో కొలువుదీరిన షిర్డీ సాయిబాబా అయిదో వార్షికోత్సవంలో భాగంగా బుధవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ నుంచి తీసుకువచ్చిన బాబా పాదుకలకు ప్రత్యేక పూజలు జరిపించారు. గణపతి, గురుదత్తాత్రేయులకు సామూహిక పూజలు చేశారు. అనంతరం 54 లీటర్ల తేనెతో భక్తులు స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. దీంతో పాటు పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పిప్పళ్ల ప్రసాదరావు బృందం ఆలపించిన శ్రీసాయి సంకీర్తనావళి భక్తులను విశేషంగా అలరించింది. ఆలయంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. 2021 నుంచి ఏటా స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా పలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం



కడలిలో ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్‌ను ప్రారంభించిన సర్పంచ్ గుణనాథ్

రాజోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా లభించిన ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని కడలి గ్రామ సర్పంచ్ చొప్పల గుణనాథ్ అన్నారు. మండలంలోని కడలి గ్రామంలో బుధవారం నాచురల్ ఫార్మింగ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ ఫుడ్‌స్టాల్ ను సర్పంచ్ గుణనాథ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు ఆకుకూరలు మిల్లెట్స్, బెల్లం, చింతపండు, పప్పుధాన్యాలు మొదలైనవి రైతు వద్దకే నేరుగా అమ్మకాలు చేయడం సంతోషకరమని సర్పంచ్ అన్నారు. కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసు, జోసెఫ్, వీపీఏ శివరామకష్ణ, యూనిట్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, కిరణ్, జూలీ చిట్టి స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



రాజోలులో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న డైరెక్టర్ మహేష్

రాజోలు: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని విజయవాడ జోనల్ చైర్మన్, ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ పిన్నింటి మహేష్ అన్నారు. బుధవారం ఆయన రాజోలు ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనలో ఆర్టీసీ కార్పొరేషన్‌ను ప్రభుత్వంలో విలీనం చేయడం అభినందనీయమన్నారు. రాజోలు డిపో పరిధిలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు, ఇతర సమస్యలపై బోర్డు సమావేశంలో చర్చిస్తామన్నారు. రాజోలు డిపో సెక్యూరిటీ భవనం పక్క నుంచి జాతీయ రహదారిపైకి డిపో లోపల నుంచి బస్సులు బయటకు వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీసీ యూనియన్ నాయకులు ఆయనకు వివరించారు. ఆర్టీసీ డిపో నుంచి బస్టాండ్‌కు లోపల వైపు నుంచి మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే 45 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగిన రాజోలు బస్టాండ్‌కు నూతన భవనం అన్ని సదుపాయాలతో నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పి.భాస్కరరావు, ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు ఎంఎస్ఆర్ మూర్తి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచక్రార్చన



విలసవిల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సౌర యాగంలో ఐదో రోజు శ్రీచక్రార్చన బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రుత్విక బృందం రేవతి నక్షత్ర జాతకులతో విప్ప వృక్షానికి పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కొత్తపేటకు చెందిన మహాశివభట్లు బ్రహ్మారాజు-అమ్మాజమ్మ దంపతులు రూ.20,232 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తాళ్లరేవు: పటవల పంచాయతీలోని ఎస్సీపేట శ్మశానానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ రాయుడు సునీత బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.ఆరు లక్షల మండల పరిషత్ నిధులతో ఈ రహదారిని నిర్మించనున్నారు. సర్పంచ్ పినపోతు చినకామేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.